ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక వారి దీపావళి హాస్య కథల
పోటీ - 2009లో సాధారణ బహుమతి పొందిన కథ !

# పెళ్లీ పెటాకులూ

"ఛీఛీ! నీతో కాపురం చెయ్యడమంత బుద్ధి తక్కువ పనింకోటి లేదు" ధుమధుమలాడుతూ ఇంట్లోంచి విసవిసా బయడపడ్డాను.

స్వప్నిని తలచుకుంటేచాలు కంపరంగా, చీదరగా వుంది. ఒళ్ళంతా చీరి కారం పూసినట్టు మండిపోతోంది. అది పెళ్లాం కాదు రాక్షసి!

బైక్ మీద గమ్యరహితంగా వెళ్తోంటే ఓ చోట అడ్వొకేట్ బోర్డు కన్పించింది.

విడాకులు తీసుకుంటే?

సడన్ బ్రేక్ వేశాను.

ఆలోచన మంచిదే. స్వప్ని కన్నా మంచి అమ్మాయిని, తందానతాన అనే అమ్మాయిని, చలాకీగా వుండే జీన్స్ అమ్మాయిని అన్నీ జాగ్రత్తగా పరిశీలించి పెళ్లాడవచ్చు. జీవితం మళ్ళీ కొత్తగా, మత్తుగా హాయ్ హాయ్‌గా వుంటుంది. 'లాహిరి లాహిరి లాహిరి' లో... అని రీమిక్స్ సాంగ్‌లా పాడుకోవచ్చు.

మరేమీ ఆలోచించకుండా అడ్వొకేట్ ఇంట్లోకి నడిచాను.

డైరీలోని ఖాళీ పేజీల్ని తదేకంగా చూస్తూ ఈగలు తోలుకుంటున్న ప్లీడరు తలెత్తాడు.

లైటు స్విచ్చి నొక్కినట్టు ముఖం వెలిగింది.

"వెల్కం... ఆయియే.... స్వాగతం..." అన్నాడు టీవీ యాంకర్లా.

అతడి వెనకాల అద్దాల బీరువాల్లో వున్న లా పుస్తకాల వాల్యూంస్ చూసేసరికి అతడి ఘనత మీద గురి కుదిరింది.

"ఒక చిన్న ప్రోబ్లం వుండి వచ్చాను..."

"ప్రోబ్లం లేకుండా ఎవరూ ప్లీడరు దగ్గరికీ, డాక్టర్ దగ్గరికీ రారు" అదోలా సకాస్టిగా నవ్వేడతడు.

ఆ నవ్వు కంపరంగా భరించరానిదిగా వుంది. ఒంటి మీద చీమలు పాకినట్టూ వుంది. మనిషి కూడా నాటకాల రాముడిలా వున్నాడు. వయస్సు తక్కువే.

"మీరు టీవీలో సినిమాల్లో నటిస్తారా?" నాటకాలంటే బాగోదని అన్నాను.

"ప్లీడర్ని పట్టుకుని యాక్టర్నా అని అడుగుతావేంటయ్యా. తిన్నగా ఇంటి నుంచే వస్తున్నావా లేక ఆ ఆసుపత్రి నుంచి..."

"అహహ, ఇంటి నుంచే, ఇంట్లో ఇమడ లేకే వచ్చాను".

"నీ సందేహాలకి ఫుల్‌స్టాప్ పెట్టి, అసలు విషయం... అదేనయ్యా విడాకుల విషయానికి రా...."

ఆశ్చర్యబోయాను.

"నేను విడాకుల కోసం వచ్చానని మీరెలా కని పెట్టేశారూ?"

"నీ మొహం చూసి!"

గతుక్కుమన్నాను.

మళ్లీ వెర్రిగా నవ్వి అంతలోనే మొహాన్ని బాధగా పెట్టేసుకుని చెప్పేను "స్వప్నితో కాపురం చెయ్యడం నా తరం కాద్సార్. రోజు రోజుకీ మా సంసారం నరకం అయిపోతో దంటే నమ్మండి..."

"నేనింకా నరకం చూళ్ళేదులే. నీ ప్రస్తుత వైఫ్ పేరేంటన్నావ్? స్వప్ని?"

"స్వప్నిక. రంగు వెలసిన స్వప్నం. క్షణక్షణం పీక్కుతినే సత్యం!"

"పేరు చాలా బావుందోయ్. నాకు యమగా నచ్చింది. మీకు పెళ్లై ఎన్నేళ్ళయ్యింది..."

ముందుకి వంగి మరీ ఆరా తీస్తోంటే మతిపోయింది.

అతడి వంక చిత్రంగా చూస్తూ అన్నాను. "జస్ట్ త్రీ ఇయర్స్ కంప్లీటెడ్"

"త్రీ ఇయర్సా? ఓ.కె. ఎడ్జస్టైపోవచ్చులే. పిల్లల్లేరు కదా?"

"దేవుడి దయవల్ల లేరు సార్"

"డబుల్ ప్లస్ పాయింటు. అంతా నా ఊహకి తగ్గట్టు పెర్ఫెక్ట్‌గా సరిపోయిందనుకో..." మిర్రి చూశాను.

"నువ్వేం కంగారు పడకోయ్. ఈజీగా డైవోర్స్ ఇప్పించేస్తానుగా. అవునూ నీ వయ్యస్సెంత?"

"ముప్పై..."

" నా కన్నా ఒన్ ఇయర్ చిన్నవాడివన్న మాట. పెద్ద డిఫరెన్స్ కాదులే. నీ జీతమెంత?"

"నేను లోన్ కోసం రాలేదు. విడాకుల కోసం వచ్చాను..."

"తెలుసయ్యా మగడా. ముందు అడిగిందానికి జవాబు చెప్పు"

"9200"

"నేను పన్నెండు వేల వరకూ సంపాదిస్తున్నాను. ఈ ఇల్లు నా సొంతమే. స్వప్ని ఏజ్ ఎంత?"

"ఇరవై ఏడు..."

"పెర్ఫెక్ట్ మ్యాచ్. అన్నీ మంచి శకునాలే!" సంబరంగా అన్నాడు.

అతడికి నట్టు లూజేమో అని అనుమానం వచ్చింది.

పరిశీలనగా చూస్తూ "మీ ధోరణి నాకేమీ అర్థం కావట్లేదు..." అన్నాను.

"ఒకసారి పెళ్ళైనవాడివి. ఈ రోజుల్లో మగాడికి పెళ్ళవడం ఎంత కష్టమో నీకు తెలీదు. నాకు తెలుసు..."

"ఆ గొడవ నేను చూసుకుంటాన్లెండి. ముందు విడాకులు ఇప్పించండి చాలు..."

"వీజీగా ఇప్పించేస్తానోయ్. అసలు నా దగ్గరి కొచ్చావూ అంటే విడాకులు వచ్చేసినట్టే..."

"అంత తేలిగ్గా పనైపోతుందంటారా?" కించిత్తు సంతోషంగానే అన్నాను.

"కలపడం కష్టంగానీ, విరగ్గొట్టడం ఎంతసేపూ! కుండెడు పాలకి ఒక్క ఉప్పు కన్ను చాలు!"

"అయితే నేను మంచి ప్లీడరు దగ్గరికే వచ్చానన్న మాట"

"డౌటక్కర్లేదు. రావల్సిన చోటుకే వచ్చావు. విడాకులు తీసుకున్నాక మళ్ళీ పెళ్ళి చేసుకుంటావు కదా...?"

సిగ్గుపడుతూ తలాడించాను. అసలు ప్లాను అదే కదా!

"అప్పుడు చూసే అమ్మాయిని స్వప్నితో పోల్చుకుని ఆమె కన్నా ఇనాల్ రెస్పెక్ట్ బావుందా లేదా? బెటరా కాదా? అని చూస్తావా లేదా?"

"చూస్తాను, చూస్తాను. చూడాలి కదా. అప్పుడే కదా ది బెస్ట్ దొరికేదీ!"

"ఇదీ అలాంటి ప్రయత్నమేనోయ్. స్వప్ని..."

అతడలా పిలవడం ఇర్రిటేటింగ్‌గా అన్పించి "స్వప్నిక" అని సరిదిద్దాను.

"విడాకులిచ్చేశాక ఎవరెలా పిలిస్తే మనకేంటోయ్. అంతేకదా?"

అయోమయంగా చూస్తూ తలాడించాను.

"మన స్వప్నిని కూడా విడాకులకు ఒప్పించి ఉభయులూ కోరుతున్నారంటూ జాయింటు పిటిషన్ తగిలించామనుకో, తిరుగు టపాలో విడాకులొచ్చెయ్యవూ?!"

"స్వప్ని ఒప్పుకోదు"

"రెడీగా నేనున్నాను కదుటోయ్. ఒప్పుకుంటుంది. నీ కన్నా బెటర్ ఛాయిస్ అని చెప్పి ఒప్పిస్తానుగా. ఇహ స్వప్ని సంగతి వదలి నీ సంగతి చెప్పు. స్వప్ని అంటే నీకెందుకెందుకు ఇష్టమో మరెందుకెందుకు అయిష్టమో ఓ లిస్టు రాసి పట్రా"

"ఆ గోలంతా ఇప్పుడెందుకండీ?"

"అడ్వొకేట్ని నేనూ, నువ్వు క్లయింటువి మాత్రమే. నీ దారి సుగమం చేసి త్వరత్వరగా డైవోర్స్ ఇప్పించడం నా బాధ్యత. పెళ్లి చూపుల్నుంచి పెళ్ళిదాకా మూడ్నెల్లు పట్టి వుంటుంది. పెళ్ళి నుంచి పెటాకుల వరకూ రావడానికి మూడేళ్ళు పట్టింది. మరి రెండు నెలల్లో విడాకులిప్పిం చేస్తే నీకేమైనా అభ్యంతరమా?"

"అబ్బే అలాటిదేం లేదండి. ఎంత త్వరగా ఈ బంధం వదిలించేస్తే అంతమంచిది"

"అంత త్వరగా కొత్త బంధనం - అదేనయ్యా బంధం తగిలించు కోవచ్చు..."

ముసి ముసిగా నవ్వేను.

"మరంచేత నేను చెప్పినట్టు చెయ్యక తప్పదు. లిస్టు చక్కని దస్తూరీతో రాసి పట్రా. పన్లో పనిగా స్వప్ని ఫోటో కూడా పట్రావోయ్ ఓ పనైపోతుందీ..."

"ఫోటో ఎందుకండీ?"

"నాకు నచ్చొద్దుటోయ్"

"మీకు నచ్చుటం ఎందుకూ?"

"ఒరే పిచ్చినాన్నా పచ్చని కాపురంలో వెచ్చని నిప్పులు పోయాలి. స్వప్ని ముఖం చూడకుండా అలాటి పని చెయ్యగలమా చెప్పు?" అదోలా నవ్వేడు.

ఇబ్బందిగా చూశాను.

"ష్ ఇలా దగ్గరకిరా. బెడ్ మీద ఓకేనా?"

"డబుల్ ఓకే"

"ఇంకేం, విడాకులొచ్చేసినట్టే" ఆనందంగా చెప్పేడు.

"సందేహం లేదు. వీడెవడో పిచ్చి సన్నాసే. ఎరక్కపోయి వచ్చి ఇరుక్కు పోయాను!" అనుకొంటోంటే నా మనస్సులోని మాట చదివిన జ్ఞానిలా నవ్వేడు.

"ప్లీడరు బుర్రలో ఎన్ని మెలికలు, ఎన్ని లిటిగేషన్లు, ఎన్ని ఫిటింగులు, ఎన్ని టర్నింగులు వుంటాయో నీ బుర్రకి తెలీదుగాని నేన్చెప్పినట్టు ఫాలో అయి ఫో. నీ బుర్రలోకి రెండో ఆలోచన రానివ్వకు గాక రానివ్వకు. డైవోర్సుకే ఫిక్సై ఫో. లేకపోతే నా శ్రమ నా ఆశ అంతావేస్టైపోద్ది..."

తలూపి లేచాను.

"లిస్టుతో వచ్చేప్పుడు అడ్వాన్సు తీసుకురా. కంగారుపడకు. మగాళ్ళ డైవోర్స్ కేసులకి ఫిఫ్టీ పెర్సంట్ డిస్కౌంట్ వుందిలే..." తన ట్రేడ్‌మార్క్ నవ్వు నవ్వేడు.

కంపరంగా అన్పించినా దులపరించుకుని వచ్చేశాను.

చూస్తోంటే ఇతగాడు దేవాంతకుడిలానే వున్నాడు. తిమ్మిని బమ్మిని చేసైనా సరే విడాకులిప్పించేస్తాడు. బహుశా నా గురించి లేనివి వున్నట్టు కల్పించి చెప్పి స్వప్ని మనస్సు విరిచేయొచ్చు. లేదా ముత్యాలముగ్గు సినిమాలో విలన్‌లో నాటక మాడించి అభాండం వేయొచ్చు.

ఏం చేస్తేనేం విడాకులు ఖాయం!

సో.....మళ్ళీ కొత్త పెళ్ళికొడుకై పోవచ్చు. హీనపక్షం అయిదు లక్షల కట్నంతో చక్కని చుక్క వస్తుంది. మళ్ళీ పెళ్ళి ముచ్చట్లు... మళ్ళీ శోభనం ...మళ్ళీ హనీమూన్..... లక్కీఫెలోకి అర్థం నేనే!

ఇది వరకు చేసిన తప్పు మళ్ళీ చెయ్యకూడదు. బాపుబొమ్మ లాంటి స్వప్ని, చనువుగా నెత్తికెక్కి సవారీ చేసే స్వప్ని వద్దుగాక వద్దు.

టైట్ ఫిట్స్‌తో జలపాతంలా దూకే యంగ్ హీరొయిన్ లాంటి బ్యూటీని, అదే సమయంలో నా మాట వేదవాక్కుగా భావించేదాన్ని ఎన్నుకోవాలి!

ఆ ప్లీడరు చెప్పిన లిస్టేదో ఈ వేడిలో రాసేస్తే మంచిది కదా? కాక తగ్గితే సెకండ్ థాట్స్ రావొచ్చు కూడానూ!

తిన్నగా పార్కులోకెళ్ళి జేబులోని నోట్ బుక్ బయటికి తీశాను.

మొదట నచ్చని విషయాలు రాస్తే బెటర్. కొండవీటి చాంతాడంత అవుతుంది. పెన్ను తీశాను.

చెప్పింది వినకుండా 'దానికన్నా ఇలా చేస్తే బావుంటుంది' అంటూ ఎదురు చెప్పుట. భోజనం వడ్డించేప్పుడు చాలు అంటున్నా వినకుండా తినండంటూ బోల్డు వడ్డించెయ్యుట. రిలీజైన ప్రతి సినిమాకీ వెళ్దామంటే డబ్బు ఖర్చంటూ త్రోసి పుచ్చెయ్యుట. కేంటీన్లో వెరైటీ ఫుడ్ తిననివ్వకుండా లంచ్ బాక్సు ఇచ్చుట. అత్తవారిచ్చిన ప్రతి చిన్న బహుమతినీ గొప్పగా పొగడుట. పిసినారిగా వ్యవహరించుట. టీవీలో సినిమాలు చూడనివ్వకుండా న్యూస్ ఛానల్స్ పెట్టుట. క్రికెట్ 'టైంవేస్ట్' అని హీనపర్చుట. నా అభిమాన హీరోది కృతిమ నటన అని కించపరచుట.. ఇంకా... ప్రతి దానికీ సాగదీయుట. తర్కించుట. కొండొకచో సాధించుట...

అబ్బో పెద్ద లిస్టే అయ్యింది. ఇంక చాలుగానీ నచ్చినవి రాద్దాం.

అందంగా వుండుట. నవ్వు మరీ బావుండుట. నేనంటే చచ్చేంత ప్రేమ కనబర్చుట. ఉదయం లేస్తూనే టానిక్ లాంటి ముద్దు ఇచ్చుట. చక్కగా వంట చేయుట. బెడ్‌మీద అదరహో అన్నట్టు వుండుట. ప్రతీ దానికీ ప్లస్ పాయింట్లు మైనస్ పాయింట్లు చెప్పి విశ్లేషించుట. పొదుపు చేయుట. గర్వం అసూయ లేకపోవుట.

ఇలాంటివే ఇంకొన్ని వుంటాయి. ఇవి ఆడవాళ్ళంతా కనబర్చే సామాన్య లక్షణాలే ప్రత్యేకతేం లేదు.

హమ్మయ్య! ఒక పనయ్యింది. రేపే ఈ లిస్టూ స్వప్ని ఫొటో ఇచ్చెయ్యాలి. అవునూ – నా ఫొటో అడక్కుండా స్వప్ని ఫొటో ఎందుకడిగినట్టు ?

ఎందుకో ఒకందుకులే. అతడి చావేదో అతడ్ని చావనీ!

ఇంటికెళ్ళాను ఎంతో రిలీఫ్‌గా ఫీలవుతూ.

"అరె ఎక్కడి కెళ్ళారు. పోస్టు బాక్సు చూట్టానికి సెల్లార్లో కెళ్ళారను కున్నాను. చికెన్ పకోడీలు వేశాను. చల్లారిపోతున్నాయి..."

"నిజంగానే? పట్రా పట్రా" నోట్లోంచి లాలాజలం కారిపోతోంటే అన్నాను.

హాట్ ప్యాక్ లోంచి తీసి పెట్టింది స్వప్ని.

"ఓహ్ అద్భుతం! నీకు నువ్వే సాటి!"

"ఇందాక చిటపటలాడ్తూ వెళ్ళారుగా!" నవ్వింది.

"అదీ... నా ఆఫీసు వాళ్ళతో కలిసి భద్రాచలం టూర్‌కి వెళదామంటే వద్దని తర్కం వేశావు కదా. నా మాటంటే విలువ లేకుండా పోతే రోషం రాదూ? నాకు మీసం లేదూ? నేను మగాడ్ని కాదూ?"

"మీరు మగాడు కాకపోతే నేనెందుకు పెళ్ళాడతానూ!" మందహాసం చేసింది.

ఉలిక్కిపడ్డాను.

"టూర్ల కెళ్ళడం నాకూ ఇష్టమే. పాపికొండల సౌందర్యాన్ని చూడాలని నాకూ ఉబలాటంగానే వుంది. కానీ దానికయ్యే ఖర్చు నాలుగు వేలు. 15 రోజుల జీతం. దాన్ని బ్యాంకులో దాస్తే ఆరేళ్ళకి రెట్టింపవుతుంది. మన బాబుని గాని, పాపని గాని స్కూల్లో చేర్చడానికి సరిపోతుంది"

"ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నాట్ట వెనకడి కెవడో నీ లాటివాడే....."

"ఇక్కడ ఆలు వుంది. ప్లానింగ్ మానేస్తే చూలు వస్తుంది. ఆ ఉత్తర క్షణాన్నుంచి ఖర్చులూ రెట్టింపవుతాయి. మనం పిల్లలకు ఆస్తిపాస్తు లివ్వక్కర్లేదు. మంచి చదువులు మాత్రం చెప్పించాలి. అందుకోసం ఇప్పట్నుంచీ జాగ్రత్త పడకపోతే ఎలా చెప్పండి?"

గోముగానే అంది గానీ నా అహం మరింత దెబ్బతింది. కోపం వచ్చేసింది.

"ముందుచూపు నీకే గాని నాకు లేదంటావు. నేను చదువుకోని బడుద్దాయి నంటావు. నీకే తెలివి తేటలున్నాయంటావు. అందుకే నువ్వంటే నాకసహ్యం. నువ్వు చెప్పినట్లు నేను వినను. నా భార్య నేను చెప్పినట్లు నడవాలి. నా మాటే ఫైనల్ కావాలి...."

విసురుగా లేచి గదిలోకెళ్ళిపోయాను.

డిన్నర్ దగ్గర ఏదేదో చెప్పి నన్ను ప్రసన్నం చేసుకోవాలని చూసింది. నేను బిగుసుకు పోయాను.

"తోటకూర వేపుడు, పప్పుబచ్చలి కూర, ఇవా కూరలు? నేను గడ్డి తినే పశువులా కన్పిస్తున్నానీకు!" సగం తిని లేచిపోయాను.

"ఇవాళ మీకేమయ్యిందీ..."

"ఐ హేట్యూ..."

ఎప్పటికో పడక మీదకొచ్చింది కవ్వించింది. కరిగిపోయాను. ఆపైన అల్లుకుపోయాను.

మర్నాడు పేపర్ చదువుతోంటే యథాప్రకారం పొగలు క్రక్కే కాఫీ అందిచ్చింది.

ఇలాంటి స్వప్నిని వదులుకోవడం బాధాకరమన్పించింది. ఒక్క క్షణమే. మరో స్వప్ని లభించ బోతూంటే ఈ స్వప్ని ఓ లెక్కా – అనుకుంటూ తయారై ప్లీడరు ఇంటికెళ్ళాను.

"ఫొటో తెచ్చావా?" ఆత్రంగా అడిగాడు ప్లీడరు.

స్వప్ని చూడకుండా ఆల్బంలోంచి పీకి తెచ్చిన ఫొటో ఇచ్చాను.

"వెరీగుడ్. నాకు నచ్చిందోయ్"

"నాక్కావాల్సింది మీకు నచ్చడం కాదు – విడాకులు!"

"లంకెలూ లింకులూ లేకుండా ఎలా మాట్లాడతానోయ్ పిచ్చోడా. ఇష్టాయిష్టాల లిస్టేది?"

ఇచ్చాను.

"మార్వలెస్. పద మీ ఇంటికెళ్దాం"

"ఎందుకండీ?"

"ముసుగులో గుద్దులాటవద్దు. వ్యవహారం ముఖాముఖి తేల్చేసుకుందాం. స్వప్ని నాకు పిచ్చిగా నచ్చింది. నేను పెళ్లి కాని బ్రహ్మచారిని. నీ కన్నా మంచి పొజిషన్లో వున్నవాడ్ని. సో.... స్వప్ని నన్ను చేసుకోవడానికి ఒప్పేసుకుంటుంది. దెన్ నీ విడాకులకి లైన్ క్లియర్!"

మళ్ళీ అదే వంకరనవ్వు అతడి పెదాల మీద!

దిమ్మ తిరిగిపోయింది.

తల విదిలించాను.

"నాకు నచ్చని స్వప్ని మీకు నచ్చిందా?"

"యమ యమగా. నువ్వో పిచ్చోడివి గనుక పెళ్లంటే యజమాని బానిసల సంబంధం అనుకుంటున్నావు. నేనేమో భాగస్వామ్యం అనుకుంటున్నాను. భార్యాభర్తలిద్దరూ సమభాగస్తులు. కోరికలు, ఆశలు, ఆశయాలు, ఆనందాలు, కన్నీళ్ళు, బరువులు, బాధ్యతలు అన్నీ కలబోసి పంచుకోవాలని విశ్వసిస్తాను. సో-స్వప్ని నా ఐడియల్ పార్టనర్. ఏమంటావోయ్ మైడియర్ గిరీశం?"

బుర్ర గిర్రున తిరుగుతోంది. నోట మాట రావట్లేదు.

గుండెల్లో ఏవో కూలిపోతున్న శబ్దాలు!

"సారీ సార్. స్వప్ని నాది. సిర్ఫ్ నాది. తేడాలూ అభిప్రాయ భేదాలూ వచ్చినా స్వప్ని నా జీవితం. నా జీవనసహచరి. నా బ్రతుకుని నందనవనం చేసే పరుసవేది..."

గబుక్కున అతడి చేతిలోని ఫొటోనీ, లిస్టునీ లాగేసుకున్నాను.

"టీ త్రాగి వెళ్లండి" రెండు కప్పుల్తో నవ్వుతూ ఎంట్రీ ఇచ్చిందొకామె.

మిర్రి చూశాను. ఆశ్చర్యాంబుదిలో నిలువునా మునిగిపోతూ చూశాను.

"నా అర్థాంగి!"

ప్లీడరు పెదాల మీది నవ్వు వంకరగా లేదు. వందనం చేయాలన్పించేలా వుంది!

* * *

(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ఏప్రిల్ 2010)